క్లుప్తంగా

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా ఏసీఎల్ కార్యాలయంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను అనర్హులకు ఇచ్చి వాస్తవమైన వారికి అన్యాయం చేస్తున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను అధికారులు అవినీతికి పాల్పడి దళారుల జేబుల్లో నింపుతున్నారని విమర్శించారు. అనంతుల మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యాల్కా సోమన్న, అధ్యక్షుడు మల్లయ్య, భాస్కర రెడ్డి, దస్తగిరి, లింగమ్మ, సుజాత, మంజుల, నరహరి, యాదయ్య, రేణుక, గంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

అర్వపల్లి : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరిధిలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకునేవారు గతంలో చదివిన పాఠశాల నుంచి టీసీ తేవాలని, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్ ఫోటోలను సెప్టెంబర్ 10లోపు పాఠశాల అసిస్టెంట్ కోఆర్డినేటర్ దర్శనం రమేష్‌కుమార్‌కు సమర్పించాలని సూచించారు. వివరాల కోసం 9550475444 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో స్వచ్ఛదనం - పచ్చదనం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని పట్టణంలోని జీఆర్ వివేకవాణి విద్యామందిర్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 60ఫీట్ల రోడ్డు నుంచి వాణిజ్య భవన్ సెంటర్ వరకు ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ సంతోష్ శర్మ, ప్రిన్సిపాల్ స్వప్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

కుక్కల దాడి.. మహిళకు తీవ్ర గాయాలు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలో నివాసముంటున్న చిత్తలూరి లక్ష్మి మంగళవారం ఉదయం ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా ఆమెపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుటుంబ సభ్యులు ఆమెను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. తమ కాలనీలో కుక్కల బెడద తీవ్రమైందని, బయటికి వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ఆదర్శనగర్ కాలనీవాసులు అంటున్నారు. కుక్కల బెడద నుంచి రక్షించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న గోపి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన గార్లపాటి పెద్దచంద్రారెడ్డి, కొన్నె రవిలు ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుల కుటుంబాలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు దొంగరి గోపి పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కోదాడరూరల్ : కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలో వయనాడ్ వరద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, జుట్టుకొండ బసవయ్య, దేవరం వెంకటరెడ్డి, ముత్యాలు, సైదా, దాసరి శ్రీను, వీరాంజనేయులు, శ్రీను, ప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు స్థలం కొరత

- చివ్వెంలలో డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇబ్బందులు
- రోడ్డు వెంబడే చెత్తాచెదారం పడేస్తున్న ప్రజలు, జీపీ సిబ్బంది


చివ్వెంలలో రహదారి పక్కన పడేసిన చెత్తాచెదారం

చివ్వెంల : చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను ప్రధాన రహదారుల వెంట పడేస్తుండడంతో వాహనదారులు, సమీప ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చివ్వెంలలో కొన్నేళ్ల నుంచి డంపింగ్‌యార్డుకు స్థలం లేకపోవడంతో ఈ సమస్య పరిష్కారం కావడంలేదు. మండల కేంద్రంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ప్రభుత్వ స్థలం దొరకలేదు. దీంతో గత పాలకులు, అధికారులు డంపింగ్ యార్డు ఏర్పాటు చేయలేకపోయారు.

రహదారుల వెంటే..

గ్రామంలో పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్‌లో తీసుకొచ్చి మండల కేంద్రం నుంచి సూర్యాపేట, బీబీగూడేనికి వెళ్లే ప్రధాన రహదారి వెంట డంప్ చేస్తున్నారు. డంపింగ్ యార్డు లేకపోవడంతో జీపీ సిబ్బందికి కూడా ఏమి చేయాలో తోచని పరిస్థితి నెలకొంది. రోడ్డు వెంబడి చెత్తాచెదారం వేస్తుండడంతో వాహనదారులు, సమీప ప్రాంతాల్లోని ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాల కోసం వీధి కుక్కలు రహదారుల వెంట సంచరిస్తూ, దారి వెంట వెళ్లే వారిని తరుముతున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల పక్కనే ఉన్న చెరువు కట్టపై చెత్తను డంపు చేస్తుండడంతో కార్యాలయాలకు వివిధ పనుల కోసం వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ప్రభుత్వ స్థలం లేక..

చివ్వెంల మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయలేకపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎర్ర సూర్యాతండా పక్కన ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ అక్కడకు చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్ వెళ్లేందుకు దారి లేదని తెలుపుతున్నారు. పైగా దూరం కూడా ఎక్కువ అవుతుండడంతో చెత్తను తరలించలేకపోతున్నట్లు చెబుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

ప్రభుత్వ స్థలం లేకపోవడంతో మండల కేంద్రంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడానికి ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతాం.

– సంతోష్ కుమార్, ఎంపీడీఓ, చివ్వెంల

షీ టీమ్, మహిళా భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ ఎస్ఐ నీలిమ

సూర్యాపేటటౌన్ : షీ టీమ్, మహిళా భద్రత, మత్తు పదార్థాలు, గంజాయి, టీయాప్‌లపై మంగళవారం షీ టీమ్ ఎస్ఐ నీలిమ పట్టణంలోని 60 ఫీట్ రోడ్డులోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళా రక్షణ, మత్తు పదార్థాలు, గంజాయిలపై ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో పటిష్టంగా పని చేస్తున్నామని అన్నారు. సమస్యలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి, అధికారుల దృష్టి తేవాలని విద్యార్థినులకు సూచించారు. మానసిక ధైర్యం కలిగి ఉండాలని, అనుకూల, ప్రతికూల సమయాల్లో స్పందించేలా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల కోరికలను, కలలను నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరగాళ్ల మోసాలకు గురి కావద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వేధింపులపై ప్రతి మహిళ ఫోన్‌లో టీ సేఫ్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఉండాలని అన్నారు. అత్యవసర సమయాల్లో 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ ఏఎస్ఐ సాలయ్య, హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి, భరోసా సెంటర్ మౌనిక, శృతి, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ధర్మకర్తల మండలికి దరఖాస్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి, తుంగతుర్తిలోని పట్టాభిరామస్వామి దేవాలయాల నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ వై.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం అర్వపల్లిలోని దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్వపల్లి ఆలయానికి ఏడుగురు ధర్మకర్తలు, తుంగతుర్తి ఆలయానికి ఐదుగురు ధర్మకర్తల నియామకం జరుగుతుందని చెప్పారు. ధర్మకర్తలలో ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన ఒక మహిళ ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు 20 రోజుల్లో దరఖాస్తు పత్రాలను నల్లగొండలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు ఆలయ ఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఇందిరా మహిళా శక్తి పథకంపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ


సమావేశానికి హాజరైన మహిళలు

సూర్యాపేట : మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వివిధ స్వయం సహాయక సంఘాలలోని మహిళలు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలలో పనిచేసే మహిళలు ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్తగా ఉంటారని, వారు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు పొంది సొంతంగా వ్యాపారం ప్రారంభించుకోవాలని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడారు. మున్సిపాలిటీ ద్వారా తొమ్మిది గ్రూపులకు, 75 మందికి వ్యక్తిగతంగా రూ.5 కోట్ల 20 లక్షల రుణాలు మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. మహిళలు సొంతంగా యూనిట్లు పెట్టడానికి ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఇన్‌చార్జ్ శ్వేత, సీఓలు, ఆర్పీలు, ఏఎల్ఎఫ్ అధ్యక్షులు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలను రద్దుచేయాలి


సూర్యాపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు

భానుపురి: మోదీ సర్కార్ తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని అఖిలభారత యువజన సమాఖ్య పట్టణ కార్యదర్శి ఏడెల్లి శ్రీకాంత్ అన్నారు. సంఘం జాతీయ సమితి పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని పీఎస్ఆర్ సెంటర్‌లో సూర్యాపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి బలవంతంగా ఈ చట్టాలను ఆమోదించిందన్నారు. ఇలాంటి చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోకపోతే అఖిలభారత యువజన సమాఖ్య పోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కోశాధికారి తాళ్ల సైదులు, శ్రీనివాస్, గాలి రామకృష్ణ, రెడ్డిమల్ల శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లో జాప్యం.. పనులకు ఆటంకం

- అర్వపల్లి పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన గదుల నిర్మాణాలు
- పనులను పూర్తి చేసి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్న విద్యార్థులు


అర్వపల్లి పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన అదనపు గదులు, వంట గదుల నిర్మాణాలు


పూర్తికాని మరుగుదొడ్ల పనులు

అర్వపల్లి : కనీస వసతులు కొరవడిన ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం మన ఊరు-మన బడి పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పట్లో ఈ పథకం నందు మొదటి విడతలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. అందులో భాగంగా అర్వపల్లి ప్రాథమిక పాఠశాలకు ఎంఎంబీ, ఎన్ఆర్ఈజీఎస్ పథకాల ద్వారా రూ.33.74లక్షల నిధులు మంజూరు కాగా 2022 జూలై 19న అప్పటి తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నిధులతో అదనపు గదులు, వంట గది, బాల, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఇప్పటి వరకు అదనపు గదులు, టాయిలెట్ల నిర్మాణాలు పూర్తయినా.. ఇంకా వీటిలో చిన్న చిన్న పనులు చేపట్టాల్సి ఉంది. ఫ్లోరింగ్, రంగులు వేసే పనులు కాలేదు. ఇదిలా ఉంటే ఈ పనులు చేసిన వారికి ఇంత వరకు పూర్తి స్థాయిలో బిల్లులు రాలేదు. ప్రజాప్రతినిధులు బయట లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పనులు చేశారు. కానీ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. మిగతా పనులు పూర్తి చేయాలంటే తమకు బిల్లులు విడుదల చేయాలని వారు కోరుతున్నారు. పూర్తి స్థాయిలో పనులు పూర్తవకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడంలేదు.

బిల్లులు విడుదలైతే పనులు పూర్తి చేస్తాం



మన ఊరు-మన బడి పథకం ద్వారా అర్వపల్లి పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభించాం. అయితే ఈ పనులకు సంబంధించి బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నిధులు వెంటనే విడుదల చేస్తే పనులను పూర్తి చేస్తాం.

– బైరబోయిన సునీత, మాజీ సర్పంచ్, అర్వపల్లి

సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ పరిధిలో సింగిల్ విండో ద్వారా రుణాలు పొందిన వారు రుణమాఫీని సద్వినియోగం చేసుకోవాలని సంఘం చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, సీఈఓ మేడెబోయిన రామస్వామి కోరారు. రుణమాఫీ పొందిన రైతులు, రుణాలు పొందే రైతులు అవసరమైన పత్రాలు తీసుకొని కార్యాలయానికి రావాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ బిచ్చునాయక్

అర్వపల్లి : విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని మండల సామాజిక ఆరోగ్య అధికారి ఎం.బిచ్చునాయక్ కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల పరిధిలోని కాసర్లపహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి తెలియజేశారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహాచారి, సూపర్‌వైజర్ లలిత, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, వైద్యసిబ్బంది నాగరాణి, శ్వేత, ఆశ కార్యకర్తలు సుజాత, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

అర్వపల్లి : రామన్నగూడెంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం గ్రామంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను తెలియజేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను పూర్తి చేయించాలని అన్నారు. మురుగు కాలువలు, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఎస్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం చిప్పలపల్లి ధర్మయ్య, సీనియర్ అసిస్టెంట్ రామరాజు జలేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్‌రావు, గ్రామశాఖ అధ్యక్షుడు దోరెపల్లి మధు, రమావత్ లాలునాయక్, రామకృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు దాతల సాయం


సూర్యాపేటరూరల్ : ఇమాంపేట మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థినులకు బెడ్ షీట్లు అందజేస్తున్న పటేల్ రమేష్ రెడ్డి


నాగారం : ఫణిగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సామగ్రిని బహూకరిస్తున్న మీలా మహదేవ్

సూర్యాపేటరూరల్ : విద్యార్థులకు చదువే లక్ష్యం కావాలని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సూర్యాపేటకు చెందిన భూక్య దామోదర్ తన తల్లి భూక్య లక్ష్మి జ్ఞాపకార్థం ఇమాంపేట మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థినులకు అందజేసిన బెడ్ షీట్స్‌ను మంగళవారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. తాను పాఠశాలను దత్తత తీసుకొని ఇప్పటికే రూ.10 లక్షల విలువ చేసే పరుపులను పంపిణీ చేసినట్లు తెలిపారు. మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో సీట్లు సాధిస్తారని ప్రిన్సిపల్ చెప్పడం అభినందనీయమన్నారు. పాఠశాలకు మంచి ప్లేగ్రౌండ్, సీసీ రోడ్డు, బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీసీడీఓ పూలమ్మ, ప్రిన్సిపల్ శంకర్ నాయక్, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, కేజీబీవీ ప్రిన్సిపల్ హుస్నేన బేగం, వల్దాస్ దేవేందర్, ప్రభాకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సుధాకర్ పీవీసీ కృషి

అర్వపల్లి : విద్యాభివృద్ధికి సుధాకర్ పీవీసీ ప్రొడక్ట్స్ కంపెనీ కృషి చేస్తోందని ఆ కంపెనీ ఎండీ మీలా మహదేవ్ అన్నారు. అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు సుధాకర్ పీవీసీ ప్రొడక్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.40వేల విలువ చేసే డ్యూయల్ డెస్క్ బెంచీలు, బీరువాలు, గ్రీన్‌బోర్డులు, ర్యాక్‌లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడి పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో 10జీపీఏ సాధిస్తూ చదువులో ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. పాఠశాలకు గ్రంథాలయ పుస్తకాలు, క్రీడా పరికరాలు కూడా తమ కంపెనీ ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎండీ మహదేవ్‌ను పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్, హెచ్ఎం జయలక్ష్మి, పీడీ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, సుధాకర్ పీవీసీ కంపెనీ అకౌంట్స్ మేనేజర్ ఆమంచి అచ్యుతశర్మ, ఉపాధ్యాయులు శ్రీదేవి, మధుకర్, విమల, శ్రీరాములు, రమేష్, ప్రసన్న, స్వర్ణలత, శోభారాణి, వీరన్న, నాగయ్య, సునంద, అంజలి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరి జెడ్పీహెచ్ఎస్‌కు సామగ్రి అందజేత

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి జెడ్పీహెచ్ఎస్‌కు సూర్యాపేటకు చెందిన సుధాకర్ పీవీసీ ఇండస్ట్రీస్ చైర్మన్ మీలా మహదేవ్ మంగళవారం రూ.48 వేల విలువగల సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బి.బాలునాయక్ మాట్లాడారు. పాఠశాలకు రూ.48వేల విలువగల గ్రీన్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, రెండు బీరువాలు, ఐరన్ రాక్స్ అందజేసిన మీలా మహదేవ్‌కు కృతజ్ఞతలు తెలిపి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర రెడ్డి, విశ్రాంత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్, పీవీసీ సీనియర్ అకౌంట్స్ మేనేజర్ ఆమంచి అచ్యుతశర్మ, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ పాఠశాల పూర్వ విద్యార్థి కోరుకుప్పల నరేష్‌గౌడ్ తన సొంత ఖర్చులతో షూ, టై, బెల్టులు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. మంగళవారం బండరామారం ప్రాథమిక, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులందరికీ షూ, బెల్టుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మరొక ఉపాధ్యాయుడిని పాఠశాలలో నియమించేందుకు కృషి చేస్తానన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామికవేత్త కోరుకుప్పల నరేష్‌గౌడ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జాటావత్ చంద్రుడు, మాజీ ఎంపీటీసీ మడ్డి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు వెంకన్నగౌడ్, శ్రీనివాస్‌నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బాలలు రేపటి ప్రగతిలో భాగం కావాలి

నూతనకల్ : గ్రామాల్లోని నేటి బాలలు రేపటి దేశ ప్రగతిలో భాగం కావాలని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సమాజ సేవకులు, రచయిత పెండెం కృష్ణకుమార్ అన్నారు. మంగళవారం ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దేశ నాయకుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్లు, వాటర్ క్యాన్లు, ఆట వస్తువులు, వరల్డ్‌మ్యాప్‌లు, గోడ గడియారం, క్లాత్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పి. ముత్తయ్య మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు సహకారం అందించిన దాత పెండెం కృష్ణకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతరెడ్డి రామలింగారెడ్డి, అయోధ్య, శ్రీనివాస్, ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు బెంచీలు బహూకరిస్తున్న సుధాకర్ పీవీసీ ఎండీ మహదేవ్


తుంగతుర్తి : బండరామారం పాఠశాలలో షూ, టై, బెల్టులను అందజేస్తున్న దాత నరేష్‌గౌడ్


నూతనకల్ : దేశ నాయకుల, శాస్త్రవేత్తల చిత్రపటాలను అందజేస్తున్న దాత కృష్ణకుమార్

పాఠశాలలో బోనాల పండుగ


బోనాలతో కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మాయిలు బోనాలు ఎత్తుకున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను తెలిపేలా చిన్నారుల వేషధారణలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నగేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న రైతులు

నాగారం : మాచిరెడ్డిపల్లి శివారులోని ఊర కుంటకు వెళ్లే ప్రధాన వరద కాలువను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకొని అక్రమంగా పూడ్చి వేశాడని ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వరద కాలువను ఆక్రమించుకొని పూడ్చి వేయడంతో దాదాపు పది ఎకరాల దళితుల వరి పొలాలు, బోరు బావుల స్టార్టర్లు నీట మునిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రధాన వరద కాలువ ఇటీవలే ఆక్రమణకు గురైందని అన్నారు. ఈ విషయంపై గత 15 రోజుల క్రితం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని తెలిపారు. అధికారులు స్పందించి వరద కాలువను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈదుల రామచంద్రు, ఈదుల అంబేద్కర్, ఈదుల వెంకటేశ్వర్లు, ఈదుల మణెమ్మ, ఈదుల వీరయ్య, బుషిపాక చిన్న సోమయ్య, వడ్డే యాదగిరి, ఈదుల శ్రీనివాస్, వడ్డే వెంకన్న, ఈదుల అన్నపూర్ణ, ఈదుల రమ్య, ఈదుల కవిత, ఈదుల యాకమ్మ పాల్గొన్నారు.